క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మరమ్మతుల కారణంగా ఆదివారం మేడ్చల్ మండలంలోని పలు గ్రామాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏఈ శశిధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఘనాపూర్, ఘనాపూర్ తండాలలో అగ్రికల్చర్, డోమెస్టిక్ సర్వీసులకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని తెలిపారు.

కట్టమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠ



అమ్మవారిని దర్శించుకుంటున్న ఈటల

ఘట్‌కేసర్: వెంకటాపూర్ శ్రీకట్టమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠ శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు ప్రవీణ్‌రావు, సర్పంచ్ గీతశ్రీనివాస్, ఎంపీటీసీ రామారావు ముదిరాజ్, ఉప సర్పంచ్ సత్యనారాయణ గౌడ్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు లింగంముదిరాజ్, మాజీ అధ్యక్షుడు మహంకాళీ, జంగయ్య ముదిరాజ్, శ్రీనివాస్‌ముదిరాజ్, మత్స్యేందర్‌రెడ్డి,కుమార్‌ముదిరాజ్,భక్తులు ఉన్నారు.

జవహర్‌నగర్ అభివృద్ధికి కృషి



అధికారులతో మాట్లాడుతున్న మేయర్ కావ్య

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో రూ.4.79 కోట్ల వ్యయంతో చేపట్టనున్న జవహర్‌నగర్ ప్రధాన రహదారి పనులను హెచ్ఆర్‌డీసీఎల్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి మేయర్ మేకల కావ్య శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జవహర్‌నగర్ కార్పొరేషన్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, సమస్యలు లేని జవహర్‌నగర్‌గా మార్చడమే తన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రామలింగం, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, హెచ్ఆర్‌డీసీఎల్ ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్, డీఏ, మున్సిపల్, పబ్లిక్ హెల్త్ ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

10 రోజుల్లో 8,723 మందికి కంటి పరీక్షలు

- 4,768 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు నిర్ధారణ
- 4,337 మందికి కళ్లద్దాలు అందజేత

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ముమ్మరంగా కంటి వెలుగు

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో పది రోజుల వ్యవధిలో 8,723 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా.. ఇందులో 4,768 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు వైద్య బృందాలు నిర్ధారించాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగులో కార్యక్రమం జనవరి 19 నుంచి ప్రారంభమైంది. జిల్లాలో వంద రోజుల పాటు కంటి వెలుగులో 27,51,810 మందికి కంటి పరీక్షలు చేపట్టాలని నిర్ణయించారు.

జిల్లాలో ఇప్పటి వరకు...

జీహెచ్ఎంసీ పరిధిలోని 40 డివిజన్లలో 20,92,711 మందికి, 13 పురపాలక సంఘాల్లోని 289 డివిజన్లు/వార్డుల్లో 5,36,567 మందికి, 61 గ్రామ పంచాయతీల్లో 1,22,532 మందికి కంటి పరీక్షలు నిర్వహించేందుకు 79 వైద్య బృందాలను నియమించారు. ఒక్కో బృందంలో వైద్యుడు, నేత్ర వైద్య సహాయకుడు, ఆపరేటర్‌తో సహా ఏడుగురు సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకున్నారు. సెలవు దినాలు మినహా వారానికి ఐదు రోజుల చొప్పున వంద రోజుల పాటు కంటి పరీక్షలు కొనసాగించనున్నారు.

కేటగిరి వారీగా...

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో పది రోజుల వ్యవధిలో 8,723 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా ఇందులో పురుషులు 3,944 మంది ఉండగా, మహిళలు 4,768 మంది ఉన్నారు. కంటి పరీక్షల్లో వైద్య బృందాలు 4,768 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు నిర్ధారించగా, ఇందులో 1,341 మంది కంటి చూపునకు సంబంధించిన కంటి అద్దాలు అందజేసిన జిల్లా వైద్యారోగ్య శాఖ 2,996 మందికి రీడింగ్ కంటి అద్దాలను పంపిణీ చేసింది.

ఆన్‌లైన్ ద్వారానే టెండర్ ప్రక్రియ



సమావేశంలో మాట్లాడుతున్న పాలకులు

కీసర: కీసరగుట్టలో వాహనాల పార్కింగ్ వసూలు చేసేందుకు గుత్తేదారుని నియామకం నిమిత్తం ఆన్‌లైన్ టెండర్‌పై శనివారం ఉదయం కీసర గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ నాయకపు మాధురివెంకటేష్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఓపెన్ టెండర్ విధానంలో పార్కింగ్ వేలం నిర్వహించేవారని, ఈ సారి ఆన్‌లైన్ టెండర్ నిర్వహణతో టెండర్లు వేసే వారికి ఇబ్బందులు ఏర్పడుతాయని పలువురు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అయినప్పటికీ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆన్‌లైన్ టెండర్ ప్రక్రియనే కొనసాగించడం జరుగుతుందని ఎంపీడీఓ రమాదేవి తెలిపారు. ఆసక్తి గలవారు ఆన్‌లైన్ ద్వారా టెండర్ వేసుకోవాలని సూచించడంతో పాటు ఆన్‌లైన్ టెండర్ విధానంపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ వెంకటేష్, ఎంపీపీ ఇందిరా లక్ష్మీనారాయణ, గ్రామ కార్యదర్శి సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పోచారం: జాతీయ కేన్సర్ దినోత్సవం సందర్భంగా నారపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం కేన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య విద్యా బోధకురాలు పద్మ, డాక్టర్ ఫణీందర్ రెడ్డి, సీహెచ్‌ఓ మీనా కుమారి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

జీఓ-59 ప్రకారం బ్యాంకుల్లో రుసుము చెల్లించాలి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని తహసీల్దార్ మీటింగ్ హాలులో శనివారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జీవో–59 లబ్ధిదారులకు తమకు వచ్చిన రసీదు ప్రకారం బ్యాంకుల్లో రుసుము చెల్లించాలన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన బ్యాంకుల్లో రుసుము చెల్లించాలని, దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేత



విద్యార్థులకు క్రీడా సామగ్రి, దుస్తులను అందజేస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం ప్రభుత్వ పాఠశాల్లో చదువుకుంటున్న విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శనివారం నాగారం మున్సిపల్ పరిధిలోని రోజు వాకర్స్ ఆధ్వర్యంలో రూ.12 వేలు, తాను సొంతంగా అందజేసిన రూ.8వేలు మొత్తం రూ.20 వేల విలువ చేసే క్రీడా సామగ్రితో పాటు క్రీడా దుస్తులను విద్యార్థులకు ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత...

మున్సిపాలిటీ రాంపల్లి గ్రామంలో అనారోగ్యం కారణంగా మృతిచెందిన మీసాల భిక్షపతి అంత్యక్రియల నిమిత్తం నా గారం చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి రూ.10 వేల ఆర్థిక సా యంను శనివారం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన నేత కౌకుట్ల రాహుల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సాంకేతిక, పారిశ్రామిక పరిజ్ఞానం తప్పనిసరి



టెక్నికల్ ఫెస్ట్‌లో సతీష్‌కుమార్

మేడ్చల్‌రూరల్: ప్రస్తుత సమాజంలో విద్యార్థులు, యువతకు సాంకేతిక, పారిశ్రామిక పరిజ్ఞానం తప్పనిసరి అని నాస్కాం డిప్యూటీ డైరెక్టర్ సతీష్‌కుమార్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం టెక్నికల్ ఫెస్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. టెక్నాలజీ రోజు రోజుకు మారుతుందని, అందుకు అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వెస్ట్ ఏంజిల్ ల్యాబ్ సీనియర్ హెచ్ఆర్ రాజశేఖర్ రెడ్డి, కళాశాల సెక్రెటరీ టీవీ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత, డైరెక్టర్ సరోజారెడ్డి, పీఆర్వో రవిసుధాకర్, ఏఓ ప్రభాకర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధిక నల్లా బిల్లులపై బీజేపీ నిరసన



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్‌రూరల్: అధికంగా నల్లా బిల్లులు వసూలు చేస్తున్నారని బీజేపీ నాయకులు శనివారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు కొంపల్లి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. గుండ్లపోచంపల్లి గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారడంతో మున్సిపల్ చట్టంలో ఉన్న పాత స్లాబ్‌ల ప్రకారం కాకుండా ఇష్టానుసారంగా నల్లా బిల్లులు పెంచి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వెంటనే నల్లా బిల్లులను తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ కౌన్సిలర్లు హంసాకృష్ణగౌడ్, సరస్వతి, పార్టీ అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు కిషన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

పినపాక ఎమ్మెల్యే రేగ కాంతారావు



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాంతారావు, విద్యార్థుల నృత్య ప్రదర్శన

పోచారం: శాస్త్ర సాంకేతిక రంగాల్లో సాధించిన ప్రగతితోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని పినపాక ఎమ్మె ల్యే, ప్రభుత్వ విప్ రేగ కాంతారావు అన్నారు. యమ్నం పేట్‌లోని రాక్ ఉడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో రిథమ్ పేరుతో నిర్వహించిన ఐదో వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు ఇతర రంగాల్లో ప్రతిభ చూపాలన్నారు. ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలంటే ఏకాగ్రత తప్పనిసరిగా ఉండాలన్నారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు బాధ్యతలను విశిష్ట అతిథిగా విచ్చేసిన ఐపీఎస్ స్నేహా మెహ్రా వివరించారు. అనంతరం అతిథులను స్కూల్ చైర్మన్ రామానాయుడు, సీఈఓ సుబ్రహ్మణ్యం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వ హించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరి ంచాయి. ఐఎస్‌బీ అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ అజయ్ సింగ్, బీహెచ్ఈఎల్ సీనియర్ సైంటిస్ట్ డీకే శర్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజానికి ఉపయోగపడేలా సీఎస్ఆర్ నిధులు వెచ్చించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆంద్రె జింగ్రాస్

కీసర: కార్పొరేట్ సంస్థలు తమ సీఎస్ఆర్ నిధులతో చేపట్టనున్న కార్యక్రమాలు సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని బాల వికాస వ్యవస్థాపకులు ఆంద్రే జింగ్రాస్ అన్నారు. శనివారం రాంపల్లిదాయరలో గల సంస్థ ఆధ్వర్యంలో 600 మంది సామాజిక వ్యాపార అంకుర సంస్థలకు ఏర్పాటు చేసిన ఇమ్‌పాల్స్–2023 కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గత 45 ఏళ్లుగా బాల వికాస సంస్థ సామాజికంగా ఎన్నో ప్రజాభివృద్ధి కార్యక్రమాలను రూపొందించి పేద ప్రజలకు సేవలదిస్తుందన్నారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింగారెడ్డి శౌరిరెడ్డి మాట్లాడుతూ.. ఇమ్‌ఫాల్స్–2023 ద్వారా ఏర్పాటు చేసిన స్టాల్స్ ద్వారా 70 నూతన ఆవిష్కరణలతో ప్రేరణ కలిగించామన్నారు. కార్యక్రమంలో సెనెట్ చైర్మన్ పద్మశ్రీ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, రామన్ మెగసెస్ అవార్డు గ్రహీత అనూషగుప్తా, బాల తెరిసా, టీఎస్ఐసీ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ డాక్టర్ శాంత, బాల వికాస సీఎస్ఆర్‌బీ డైరెక్టర్ భరత్‌వాజ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఏసీపీకి సన్మానం



ఏసీపీని సన్మానిస్తున్న కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు

మేడ్చల్: నూతన డివిజన్‌గా ఏర్పడి ఏసీపీగా పదవీ బాధ్యతలు స్వీకరించిన మేడ్చల్ ఏసీపీ వెంకట్‌రెడ్డిని మేడ్చల్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్, వివిధ పార్టీల నాయకులు కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు నర్సింహా రెడ్డి, శేఖర్‌గౌడ్, శ్రవణ్‌కుమార్ గుప్తా, శ్రీనివాస్‌రెడ్డి, శివకుమార్, ఎడ్ల ఎనివాస్‌రెడ్డి, నాగరాజు గణేష్ తదితరులు ఉన్నారు.

దూడలకు బ్రూసెల్లా వ్యాక్సిన్ వేయించాలి



దూడలకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్యులు

మేడ్చల్: ఆవు దూడల్లో బ్రూసెల్లోసిస్ వ్యాధి సోకి గర్భ విచ్ఛిత్తి జరగకుండా రైతులు తమ దూడలకు బ్రూసెల్లా వ్యాక్సిన్ వేయించాలని మండల పశు వైద్యాధికారులు తెలిపారు. వివిధ గ్రామాల్లో రైతుల వద్దకు వెళ్లి దూడలకు వ్యాక్సిన్లు వేశారు. ప్రతీ గ్రామంలో రైతులు తప్పకుండా దూడలకు వ్యాక్సిన్ వేయించాలని కోరారు. ఇప్పటి వరకు మండలంలో 120 దూడలకు వ్యాక్సిన్ వేసినట్లు వైద్యులు తెలిపారు.

స్నేహితుడి భార్యపై అత్యాచారయత్నం కేసులో నిందితుడి అరెస్టు

సిద్దిపేట శ్రీమంతుడిగా నిందితుడు చక్రధర్‌గౌడ్‌కు పేరు



నిందితుడు చక్రధర్‌గౌడ్



వివరాలు వెల్లడిస్తున్న శామీర్‌పేట సీఐ సుధీర్‌కుమార్

శామీర్‌పేట్: సిద్దిపేట శ్రీమంతుడిగా పేరొందిన వ్యక్తి వివాహితపై అత్యాచారానికి పాల్పడి కటకటాలపాలయ్యాడు. వివరాల్లోకి వెళితే.. సిద్దిపేటకు చెందిన చక్రధర్‌గౌడ్(38) ఫార్మర్స్ ఫస్ట్ సంస్థ వ్యవస్థాపకుడు, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. కాగా గత నెల 31న జీడిమెట్లలో తన స్నేహితులతో కలిసి పార్టీ చేసుకున్నాడు. కాగా ప్రస్తుతం తూంకుంటలో నివాసముంటున్న తన చిన్ననాటి స్నేహితుడిని కూడా పార్టీకి ఆహ్వానించాడు. పార్టీలో ఫుల్‌గా మద్యం సేవించి పార్టీ అనంతరం అదే రోజు రాత్రి చక్రధర్‌గౌడ్, మరో స్నేహితుడు బన్నూలు కలిసి తన చిన్ననాటి స్నేహితుడి(బాధితురాలి భర్త)ని కారులో తూంకుంటలోని నివాసంలో దింపేందుకు వచ్చారు. ఈ క్రమంలో తన ద్విచక్ర వాహం అల్వాల్‌లో ఉందని, అక్కడి వరకు తమతో వస్తానని బాధితురాలి భర్త కోరాడు. కొద్దిదూరం వెళ్లాక తన మరో స్నేహితుడు బన్నూతో పాటు వెళ్లమని తాను తర్వాత వస్తానని చక్రధర్‌గౌడ్ చెప్పడంతో వారు వెళ్లిపోయారు. నిందితుడు చక్రధర్‌గౌడ్ సదరు మహిళ ఇంటికి వెళ్లి డోర్ కొట్టాడు. తన భర్త అనుకొని మహిళ డోర్ తీయగానే ఇంట్లోకి వెళ్లి నా దగ్గర చాలా ఆస్తి ఉందని, అన్ని విధాల చూసుకుంటానంటూ మహిళను అత్యాచారయత్నం చేశాడు. కాగా అతడి నుంచి తప్పించుకొని గట్టిగా అరవడంతో నిందితుడు చక్రధర్‌గౌడ్ అక్కడి నుంచి పారిపోయాడు. అనంతరం జరిగిన దారుణం పట్ల భర్త పట్టించుకోకపోవడంతో బాధితురాలు ఈ నెల 1న నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించగా గమనించిన కుటుంబీకులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందించారు. అనంతరం స్థానికుల సూచన మేరకు జరిగిన ఘటనపై బాధితురాలు ఈ నెల 3న (శుక్రవారం), శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ జరిపి, నిందితుడు చక్రధర్‌గౌడ్‌ను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్ చేసినట్లు సీఐ సుధీర్‌కుమార్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సమావేశంలో ఎస్సైలు వీరశేఖర్, రవికుమార్, రఘుకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

గోడ కూల్చిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలి

పోచారం: వరంగల్ జాతీయ రహదారి నుంచి పోచారం సంస్కృతి టౌన్‌షిప్‌కు వెళ్లే రోడ్డుకు ఆనుకొని ఉన్న ప్రహరీని పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసేందుకు కూల్చివేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు పాల్పడిన విద్యాసాగర్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని ఈ నెల 27న ఘట్‌కేసర్ పోలీసులకు హౌసింగ్ బోర్డు డీఈ రామ్‌కుమార్ ఫిర్యాదు చేశారు. ఇప్పటి వరకు సదరు వ్యక్తిపై కేసు నమోదు చేయకపోవడంతో మరో మారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుప్రీం కోర్టు ఆదేశాలను అతిక్రమించి అక్రమంగా ప్రహరీ కూల్చివేసిన వ్యక్తిపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏడాదిన్నర క్రితం గోడ తొలగించేందుకు సహకరించాలని సంస్కృతి టౌన్‌షిప్ అసోసియేషన్ అప్పటి అధ్యక్షుడు శ్రీగిరి వెంకట్ మాధవ్‌రెడ్డిని మున్సిపల్ అధికారులు కోరితే అంగీకరించలేదు. దీంతో పెట్రోల్ బంక్ నిర్మాణ పనులు నిలిచి పోయాయి. కాగా ఇటీవల అసోసియేషన్ నూతన కమిటీ ఏర్పడిన కొద్ది రోజులకే గోడ కూల్చివేశారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కేసు నమోదు చేయాలని మాజీ అధ్యక్షుడు వెంకట్ మాధవ్‌రెడ్డి, మాజీ ఉపాధ్యక్షుడు మెట్టు నర్సింహారెడ్డి ఘట్‌కేసర్ పోలీసులను కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ.. టౌన్‌షిప్ ప్రధాన రహదారిలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందన్నారు. అంతేగాక దారులు ఎక్కువైతే అన్ని వైపుల నుంచి వాహనాల రాకపోకలు సాగిస్తే ప్రమాదాలు చోటు చేసుకోవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. గోడ కూల్చివేసి వారం రోజులైనా కేసు నమోదు కాలేదన్నారు. రెండో సారి ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేస్తామని పోలీసులు హామీ ఇచ్చినట్లు చెప్పారు.

ట్రక్‌లారీని ఢీకొట్టిన బైక్

- బైక్ నడుపుతున్న విద్యార్థి మృతి
- వెనకాల కూర్చున్న అతడి మిత్రుడికి తీవ్రగాయాలు



ప్రమాదంలో విద్యార్థి నాగకిషోర్ మృతదేహం



ప్రమాదానికి కారణమైన ట్రక్‌లారీ ఇదే..

కీసర: రోడ్డు ప్రమాదంలో విద్యార్థి అక్కడికక్కడే మృతిచెందిన ఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. కీసర సీఐ రఘువీర్ రెడ్డి వివరాల ప్రకారం.. కుందన్‌పల్లిలోని శ్రీరామలింగేశ్వర కాలనీకి చెందిన బొంతు శ్రీనుకు ఓ కుమారుడు, ఓ కూతురు ఉన్నారు. వాచ్‌మెన్‌గా పనిచేస్తూ పిల్లలిద్దరిని చదవిస్తున్నాడు. కుమారుడు నాగకిషోర్(15) కీసరలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. శనివారం ఉదయం నాగకిషోర్(15) తన మిత్రుడు టి.భరణి(13)తో కలిసి తమ ఇంటి పక్కనే ఉండే పొరుగువారి ద్విచక్ర వాహనం తీసుకుని చీర్యాల చౌరస్తాకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా కుందన్‌పల్లి చౌరస్తా వద్దకు రాగానే వెనక నుంచి వేగంగా దూసుకు వచ్చిన ట్రక్‌లారీ(టీఎస్07ఏఈ4419) వెనక నుంచి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఇద్దరు రోడ్డుపై పడిపోగా లారీ చక్రాలు నాగకిషోర్ తలపై వెళ్లగా తల నుజ్జయ్యి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ద్విచక్ర వాహనంపై వెనకాల కూర్చున్న టి.భరణి ఎడమ చేయి విరగడంతో పాటు పలు చోట్ల తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే లారీడ్రైవర్ లారీని కొద్దిదూరంలో నిలిపి పరారయ్యాడు. సమాచారం అందుకున్న కీసర పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108లో ఆస్పత్రికి తరలించి నాగకిషోర్ మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.